క్లుప్తంగా

ఇంటర్ ఫలితాల్లో ప్రతిభ



రాయవరంలో ప్రతిభ చాటిన విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ నాగేశ్వరరెడ్డి

రాయవరం: ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సర ఫలితాల్లో రాయవరం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు సత్తా చాటారు. కార్పొరేట్ కళాశాలలకు దీటుగా ఫలితాలు సాధించడం పట్ల విద్యార్థులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇంటర్ సెకండియర్ ఎంపీసీ విద్యార్థిని మేడిది నాగదుర్గ 972 మార్కులు సాధించి కళాశాల టాపర్‌గా నిలిచింది. కె.కీర్తన 799, పి.మోనిక సింధు 781 మార్కులు సాధించి ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. బైపీసీ గ్రూపులో పి.దుర్గాప్రసాద్ 747, సీఈసీలో ఎ.వీరదుర్గ 647 మార్కులు సాధించారు. ప్రతిభను కనబర్చిన విద్యార్థులను గురువారం కళాశాల ప్రిన్సిపాల్ డీవీవీ నాగేశ్వరరెడ్డి అభినందించారు.

ప్రభుత్వ కళాశాలల్లో మెరుగైన ఫలితాలు




పామర్రులో ఫస్ట్, సెకండ్ ఇంటర్‌లో కాలేజీ ప్రథమంగా నిలిచిన సత్య, వైష్ణవి

కె.గంగవరం/కాజులూరు: ఇంటర్మీడియెట్ ఫలితాల్లో పామర్రు, కాజులూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థులు ప్రతిభ చూపారు. పామర్రు కాలేజీలో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 30 శాతం, సెకండియర్‌లో 50 శాతం మంది పాసయ్యారని ప్రిన్సిపాల్ అంజిబాబు తెలిపారు. ద్వితీయ సంవత్సరం సీఈసీ విభాగంలో బండారు సత్య 925 మార్కులతో కళాశాల టాపర్‌గా నిలిచిందని, మొదటి సంవత్సరం బైపీసీలో పావులూరి వైష్ణవి 375 మార్కులతో ప్రథమ స్థానం సాధించిందని వివరించారు. తమ విద్యార్థులు 48 శాతం ఉత్తీర్ణత సాధించారని కాజులూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.శ్రీనివాస్ తెలిపారు. సెకండియర్ పరీక్షలకు 96 మంది విద్యార్థులు హాజరు కాగా 46 మంది విజయం సాధించారన్నారు. హెచ్ఈసీ విద్యార్థిని బండారు విజయ 937 మార్కులతో కళాశాల ప్రథమ స్థానం సాధించిందని తెలిపారు. సీఈసీ విద్యార్థిని కోన రాణి 869 మార్కులతో ద్వితీయ, బైపీసీ విద్యార్థిని సాదా లీలా సత్యప్రియ 848 మార్కులతో తృతీయ స్థానాలు సాధించారని వివరించారు.

కూలీలకు సదుపాయాలు కల్పించాలి



కపిలేశ్వరపురంలో కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీఓ రామకృష్ణారెడ్డి

కపిలేశ్వరపురం: స్థానికంగా చేపట్టిన అమృత్ సరోవర్ ట్యాంక్ పనులను ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి పరిశీలించారు. వేసవి తీవ్రత నేపథ్యంలో ఉపాధి కూలీలకు తగిన సదుపాయాలు కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రూ.9.18 లక్షల అంచనాతో చేపట్టిన చెరువు అభివృద్ధి పనుల్లో కూలీలకు 3,501 పనిదినాలు కల్పించాలన్నారు. నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ త్వరితగతిన పనులను పూర్తి చేసేందుకు కృషి చేయాలని అధికారులను ఆదేశించారు.

ఆలయ అభివృద్ధికి కృషి

కొత్తపేట: వానపల్లి గ్రామ దేవత పళ్లాలమ్మ అమ్మవారి ఆలయం అభివృద్ధికి పాలక మండలి కృషి చేయాలని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి సూచించారు. నూతన పాలక మండలి చైర్మన్‌గా కామిశెట్టి అమ్మన్న, ధర్మకర్తలుగా సబ్బితి సత్యనారాయణ, కంచుస్తంభం లక్ష్మి, ఒగ్గు సత్యవతి, కట్టా పద్మ, వానపల్లి శ్రీనివాసరావు, ఇళ్ల రాంబాబు, ఎక్స్ అఫీషియో మెంబర్‌గా వడ్లమూరి సత్తిరాజు (ఆసాది) గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. ఆలయ ప్రాంగణంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జగ్గిరెడ్డి.. పాలకవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ, ఇప్పటికే ఆలయం ముఖ మండప నిర్మాణానికి రూ.80 లక్షలు మంజూరయ్యాయని, వాటిని నాణ్యతతో పూర్తి చేయాలని సూచించారు. వచ్చే నెల తొలి వారంలో అమ్మవారి జాతర, తీర్థ మహోత్సవాలు ఘనంగా నిర్వహించాలని అన్నారు. నూతన చైర్మన్ అమ్మన్న మాట్లాడుతూ, భక్తులకు తగిన సౌకర్యాలు కల్పిస్తూ, ఆలయ కీర్తిప్రతిష్టలు ఇనుమడింపజేసే విధంగా కృషి చేస్తామని అన్నారు. తనను చైర్మన్‌గా నియమించినందుకు ఎమ్మెల్యే జగ్గిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. సభలో అముడా చైర్మన్ గొల్లపల్లి డేవిడ్‌రాజు, ఎంపీపీ మార్గన గంగాధరరావు, జెడ్పీటీసీ సభ్యురాలు గూడపాటి రమాదేవి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ముత్యాల వీరభద్రరావు, డీసీసీబీ పర్సన్ బండారు రాజా, ఎంపీటీసీ సభ్యురాలు దుప్పలపూడి సత్యవేణి, మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు నెల్లి లక్ష్మీపతిరావు, అవిడి సర్పంచ్ రెడ్డి చంటి పాల్గొన్నారు.

పచ్చిరొట్ట వేద్దాం.. పదపద

- భూసారం పెంచేందుకు ఇదే మార్గం
- రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గిద్దాం
- 50 శాతం రాయితీపై విత్తనాల పంపిణీ



పచ్చిరొట్ట పైరు జీలుగ పంట

రాయవరం: రసాయనిక ఎరువుల వినియోగంతో భూసారం అంతకంతకూ తగ్గిపోతోంది.. సాగు అనర్థదాయకంగా మారుతోంది.. దీని నుంచి విముక్తికి పచ్చిరొట్ట సాగు పరిష్కార మార్గంగా మారింది.. భూమికి బలం, దిగుబడులను పెంచే ఈ విధానాన్ని అంతా అమలు చేస్తే భవిష్యత్తు తరాలకు మేలు చేకూరుతోంది. ప్రస్తుతం రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల పరిధి రాయవరం, మండపేట, కపిలేశ్వరపురం, రామచంద్రపురం, కె.గంగవరం మండలాల్లో దాదాపు 83 వేల ఎకరాల్లో రబీ సాగవుతుంది. పంట చివరి దశకు చేరడంతో రబీ వరి కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. కోతల అనంతరం మూడో పంటగా పలువురు రైతులు అపరాల పంట పండిస్తుంటే, మరికొందరు పచ్చిరొట్టను సాగు చేస్తున్నారు. రసాయనిక ఎరువులు అధికంగా వినియోగించడం, పంటల మార్పిడి విధానాన్ని పాటించకపోవడంతో భూసారం తగ్గుతున్న నేపథ్యంలో పచ్చిరొట్ట పైరును పెంచితే భూసారాన్ని పెంచుకునే వీలుంటుందని అధికారులు చెబుతున్నారు.

భూసారం పెరుగుదలకు..

గతంలో రైతులు భూసారం పెరగడానికి పచ్చిరొట్ట పైర్లను రబీ పంట అనంతరం వేసేవారు. ఇటీవల కాలంలో ఈ పెంపకం తగ్గింది. దీనివల్ల భూసారం తగ్గి.. పంటలు తెగుళ్ల బారిన పడుతున్నాయి. రైతులు తెగుళ్లను అరికట్టడానికి విచ్చలవిడిగా రసాయనిక ఎరువులను పిచికారీ చేసి అనర్థాలను కొనితెచ్చుకుంటున్నారు. రబీకి ఖరీఫ్‌కు మధ్యలో పచ్చిరొట్ట పైర్లను పెంచడంతో భూసారం బాగా పెరుగుతుందని అధికారులు వివరిస్తున్నారు.

స్థూల పోషకాలు అధికం

జనుము, జీలుగ, పిల్లిపెసర, ఉలవ, నీలి తదితర రకాలను ఖరీఫ్ రబీకి మధ్య సాగు చేసుకోవాలి. వీటిని పూత దశ వరకు పెంచి ఖరీఫ్‌లో భూమిలో కలియదున్నాలి. పచ్చిరొట్ట పైర్లలో స్థూల పోషకాలు అధికంగా ఉంటాయి. నత్రజని 1.8 శాతం నుంచి 3.5 శాతం వరకు ఉంటుంది. అదేవిధంగా భాస్వరం 0.1 శాతం నుంచి 0.3 శాతం, పొటాషియం 0.5 నుంచి 2 శాతం వరకు ఉంటాయి. స్థూల పోషకాలతో పాటు సూక్ష్మ పోషకాలు కూడా భూమికి లభిస్తాయి. పంటల ఎదుగుదలకు ఈ మూడు పోషకాలు ఎంతో అవసరం. అలాగే నేలలు సంపూర్ణమై ఉత్పాదకత పెరుగుతుంది. భూమి లోపల నిక్షిప్తమైన పోషకాలను ఈ పైర్లు వెలికి తీస్తాయి. దీనివల్ల 30 శాతం రసాయనిక ఎరువుల వినియోగం తగ్గుతుంది. ప్రస్తుతం ఎరువుల ధరలు ఆకాశాన్నంటుతున్న పరిస్థితుల్లో పచ్చిరొట్ట పైర్ల సాగు ఎంతో మేలు చేస్తాయి.

సూక్ష్మజీవుల వృద్ధి

ఖరీఫ్, రబీ పంటల్లో రైతులు గుళికలను అధికంగా వాడడంతో భూమి లోపల సూక్ష్మజీవులు నశించిపోతున్నట్లు వ్యవసాయ అధికారుల పరిశోధనల్లో తేలింది. గతంలో ఒక గ్రాము మట్టికి కోట్లాది సూక్ష్మజీవులు ఉండగా ప్రస్తుతం వాటి సంఖ్య లక్షల్లో పడిపోయినట్లు గుర్తించారు. పంటల పెరుగుదలకు ఉపయోగమైన సూక్ష్మజీవులు నశించడం వల్ల దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపుతుంది. పచ్చిరొట్ట పైర్లను భూమిలో కలియదున్నడంతో తిరిగి సూక్ష్మజీవులు అభివృద్ధి చెందే అవకాశం ఉందని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. సహజంగా చౌడుబారిన భూముల్లో జీలుగ వేసుకుంటే భూమిలో భూసారం పెరుగుతుంది.

సద్వినియోగం చేసుకోండి



రాబోయే తరాలకు భూమిని సారవంతంగా ఉంచాలంటే పచ్చిరొట్ట ఎరువులు వేయాలి. ప్రధాన ఎరువులకు చేసే ఖర్చును తగ్గించుకుంటే నికర లాభం పొందడానికి వీలవుతుంది. ప్రభుత్వం 50 శాతం రాయితీపై ఇచ్చే పచ్చిరొట్ట విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

–కొప్పిశెట్టి ప్రభాకర్, మండల వ్యవసాయాధికారి, రాయవరం

ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



విత్తనాలను పంపిణీ చేస్తున్న సూర్యనారాయణ

కె.గంగవరం: ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ సలహా కమిటీ సభ్యుడు ఇళ్లా సూర్యనారాయణ అన్నారు. శివల గ్రామంలోని రైతు భరోసా కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం ఆయన ప్రారంభించారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రభుత్వం ప్రతి రైతుకూ గిట్టుబాటు ధర అందించేందుకు చర్యలు తీసుకుందన్నారు. రైతులు తాము పండించిన ధాన్యాన్ని దళారులకు అమ్మి మోసపోవద్దని, కొనుగోలు కేంద్రాల వద్దనే విక్రయించాలని కోరారు. అనంతరం సబ్సిడీపై పిల్లి పెసర, జనుము, జీలుగ విత్తనాలను రైతులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు దేవి వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నేడు పాఠశాల వార్షికోత్సవం

రాయవరం: పసలపూడిలో కర్రి సుబ్బారెడ్డి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవాన్ని శుక్రవారం సాయంత్రం 6 గంటలకు నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ ప్రగతి రామారెడ్డి గురువారం విలేకరులకు తెలిపారు. ముఖ్య అతిథిగా డీజీపీ కార్యాలయంలో ఎస్పీ క్యాడర్‌లో ఉన్న కొవ్వూరి సూర్యభాస్కరరెడ్డి పాల్గొంటారన్నారు. ఈ సందర్భంగా చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు ఉంటాయన్నారు.

నేడు వెదురుమూడిలో గడప గడపకూ..

కపిలేశ్వరపురం: వెదురుమూడిలో శుక్రవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరుగుతుందని ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి బుధవారం తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమంలో అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లతో ఇంటింటా పర్యటిస్తామని అన్నారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు పాల్గొని ప్రజల సమస్యలు తెలుసుకుంటారని ఎంపీడీఓ వివరించారు.

చివరికి గట్టెక్కినట్టే..



కాజులూరులో కోత దశకు చేరిన వరి చేను



మొగలిపాలెంలో మాసూళ్లు చేసిన ధాన్యాన్ని ఆరబెడుతున్న రైతులు

- పాలకుల చొరవతో చివరి దశ వరకూ సాఫీగా సాగునీరు
- ఆశాజనకంగా దిగుబడి
- రైతన్నల హర్షం

కాజులూరు: పాలకుల చొరవతో రైతులు సాగునీటి ఎద్దడిని అధిగమించి, చి'వరి'కి ఒడ్డున పడ్డారు. గోదావరిలో ఈ ఏడాది నీటినిల్వలు తగ్గుముఖం పట్టడంతో రామచంద్రపురం, కె.గంగవరం, కాజులూరు మండలాల్లో రైతులు ఆందోళన చెందారు. ముఖ్యంగా కాజులూరు మండలంలోని తణుకువాడ, శలపాక, గొల్లపాలెం, తిప్పరాజుపాలెం, దుగ్గుదుర్రు, పల్లిపాలెం తదితర గ్రామాల్లో నాట్లు వేసిన తొలి రోజుల్లోనే సాగునీరందక పొలాలు బీటలు వారాయి. వారి ఇక్కట్లను గమనించిన ప్రభుత్వం సీలేరు నుంచి జలాలను రప్పించింది. తమ ప్రభుత్వం ఒక్క ఎకరా కూడా ఎండిపోనివ్వబోదని స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ రైతులకు హామీ ఇచ్చారు. అధికారులతో పలుమార్లు సమీక్షలు నిర్వహించారు. వంతుల వారీ విధానంతో కాలువ శివారు భూములకు కూడా సాగునీరందించేలా అప్రమత్తం చేశారు. పలుమార్లు క్షేత్రస్థాయి పర్యటనలు జరిపారు. రాష్ట్ర రైతు విభాగం అధ్యక్షుడు, అగ్రి మిషన్ వైస్ చైర్మన్ ఎంవీఎస్ నాగిరెడ్డి వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొవ్వూరి త్రినాథరెడ్డి తదితరులు క్షేత్రస్థాయి పరిశీలన చేసి, అధికారులకు సమస్యను వివరిస్తూ, పరిష్కార మార్గాలు సూచించారు. ప్రభుత్వ యంత్రాంగం కృషి ఫలించడంతో కాలువ శివారు భూముల్లోని రైతులు సైతం నీటి ఎద్దడిని అధిగమించగలిగారు. మండలంలోని రైతులు ఈ రబీలో 18,076 ఎకరాల్లో సాగు చేపట్టగా ఇప్పటి వరకూ 25 శాతం విస్తీర్ణంలో పంట కోతలు పూర్తయ్యాయని మండల వ్యవసాయాధికారి వి.అశోక్ తెలిపారు. మే మొదటి వారాంతానికి నూరు శాతం పంట నూర్పిళ్లు పూర్తి కావచ్చని చెప్పారు. ప్రస్తుతం మండలంలో వరి సాగు గట్టెక్కినట్టేనని, అక్కడక్కడ పక్వానికి వచ్చిన పంటకు ఒక ఆరుతడి ఇస్తే సరిపోతుందని రైతులు చెబుతున్నారు. హెక్టారుకు సుమారు 125 బస్తాల చొప్పున దిగుబడి వస్తుండటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పేదల అభ్యున్నతే లక్ష్యం



టిడ్కో ప్లాట్ల వద్ద సంక్షేమ క్యాలెండర్లతో చైర్‌పర్సన్ దుర్గారాణి తదితరులు

మండపేట: పేదల అభ్యున్నతే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజారంజక పాలన సాగిస్తున్నారని మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి అన్నారు. జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమానికి వాడవాడలా లభిస్తున్న స్పందన అందుకు నిదర్శనమన్నారు. గురువారం స్థానిక గొల్లపుంత కాలనీలోని టిడ్కో ప్లాట్ల వద్ద గృహ సారథులు, పార్టీ నేతలతో కలసి చైర్‌పర్సన్ పర్యటించారు. స్థానికులకు సంక్షేమ క్యాలెండర్‌ను అందజేసి సీఎం జగన్ పాలన, ప్రభుత్వ పథకాల అమలుపై ప్రజాభిప్రాయ సేకరణ చేశారు. టీడీపీ పాలనలో హామీల ఉల్లంఘన, వైఎస్సార్ సీపీ సంక్షేమ పాలన గురించి వివరించారు. అనంతరం చైర్‌పర్సన్ దుర్గారాణి మాట్లాడుతూ పాలనకు ప్రజలు తమ సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నారన్నారు. పథకాలు నేరుగా ఇంటికే అందుతున్నాయని వారు ఆనందం వ్యక్తం చేస్తున్నారన్నారు. మున్సిపల్ విప్ పోతంశెట్టి ప్రసాద్, కౌన్సిలర్లు శెట్టి కల్యాణి, నీలం దుర్గ, మెండి భవాని, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ ఆలీఖాన్‌బాబా, జేసీఎస్ కన్వీనర్ యరమాటి వెంకన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల సామాజిక తనిఖీలో

తల్లిదండ్రుల భాగస్వామ్యం



రామచంద్రపురంలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఐఈ కో ఆర్డినేటర్ సత్యనారాయణ

రామచంద్రపురం రూరల్: ప్రభుత్వ పాఠశాలల సామాజిక తనిఖీలో విద్యార్థుల తల్లిదండ్రులను భాగస్వాముల్ని చేయాలని జిల్లా సహిత విద్య (ఐఈ) కో ఆర్డినేటర్ సత్యనారాయణ సూచించారు. స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ప్రధానోపాధ్యాయులు, సీఆర్‌పీలకు సోషల్ ఆడిట్‌పై ఎంఈఓ మానుపూడి శ్రీనివాస్ అధ్యక్షతన గురువారం శిక్షణ నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సత్యనారాయణ మాట్లాడుతూ, నాడు – నేడులో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి, విద్యార్థుల విద్యా ప్రగతి, పాఠశాలల అభివృద్ధిలో సమాజ భాగస్వామ్యం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి తల్లిదండ్రుల కమిటీ సభ్యులు సమాచారం సేకరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సోషల్ ఆడిట్ యాప్ ద్వారా సమాచారం సేకరించే విధానాన్ని జిల్లా రీసోర్స్ పర్సన్లు గోవిందరాజులు, లక్ష్మీనారాయణ వివరించారు.

కాజులూరులో..

కాజులూరు: పాఠశాల అభివృద్ధిలో తల్లిదండ్రులను భాగస్వాముల్ని చేయాలని ఎంఈఓ కేవీవీ సత్యనారాయణ అన్నారు. స్థానిక ఎమ్మార్సీ భవనంలో పాఠశాలల సామాజిక తనిఖీ అనే అంశంపై వివిధ ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు గురువారం ఒక రోజు శిక్షణ నిర్వహించారు. వాకలపూడి జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు ఎంఎస్ఎస్ మూర్తి రీసోర్స్ పర్సన్‌గా పాల్గొని, శిక్షణ ఇచ్చారు. పాఠశాల అభివృద్ధి, మౌలిక వసతుల కల్పనలో పేరెంట్స్ కమిటీ సభ్యుల సహకారం ఎంతో అవసరమని ఎంఈఓ సత్యనారాయణ అన్నారు. కార్యక్రమంలో సీఆర్‌పీలు డి.సత్యనారాయణ, చంటిబాబు, సుజాత, కె.శ్రీనివాసరావు, ఎం.ప్రశాంతి, నాగజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్తు అంతరాయం

కాజులూరు: లైన్ల మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు పనుల కోసం కాజులూరు, తాళ్లరేవు మండలాల్లోని పలు గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరా తాత్కాలికంగా నిలిపివేయనున్నారు. ఏపీఈపీడీసీఎల్ కాకినాడ డీఈ జి.ప్రసాద్ ఈ విషయం తెలిపారు. గొల్లపాలెం మెయిన్ సబ్‌స్టేషన్ ఏఈ ఎం.సూర్యనారాయణ ఆధ్వర్యాన గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాజులూరు సబ్ స్టేషన్ పరిధిలోని కాజులూరు, తిప్పరాజుపాలెం, అయితపూడి, ఒంటితాడి; తాళ్లరేవు మండలం ఇంజరం సబ్ స్టేషన్ పరిధిలోని కోలంక, నామవానిపాలెం, చలివేంద్రపాడు, పోలమూరుపాడు తదితర గ్రామాల్లోని గృహ వినియోగదారులకు ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని వివరించారు. ఇదే సమయంలో గొల్లపాలెం సబ్ స్టేషన్ పరిధిలోని ఆక్వా, ఇండస్ట్రియల్ ఫీడర్‌లో కూడా విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని తెలిపారు.

పచ్చి కర్ర దశలోనే ఎంటీయూ–1121 కోయాలి

రామచంద్రపురం రూరల్: ఎంటీయూ–1121 (సన్నాలు) రకం పండించిన రైతులు పచ్చి కర్ర దశలోనే పంట కోత కోయాలని మండల వ్యవసాయ అధికారి ఎస్.సత్యప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పంట దశలోనే ఈ రకం గింజ ఆరిపోయే స్వభావం కలిగి ఉంటుందని, దీనివలన కోతలు ఆలస్యమైతే ముక్కలుగా విరిగిపోయే అవకాశం ఉంటుందని వివరించారు. పంట కోసిన తరువాత కూడా ఒక రోజు మాత్రమే ఆరబెట్టుకోవాలని సూచించారు. దీనివల్ల నూకల శాతం తగ్గించుకోవచ్చని సూచించారు.

మేడే పోస్టర్ ఆవిష్కరణ

రామచంద్రపురం: అఖిల భారత రైతు కూలీ సంఘం ఆధ్వర్యాన స్థానిక పాత బస్టాండ్ వద్ద గురువారం మేడే పోస్టర్ ఆవిష్కరించారు. జిల్లా నాయకుడు గెద్దాడ సూరిబాబు మాట్లాడుతూ, మేడేను పురస్కరించుకుని ప్రభుత్వ రంగ పరిశ్రమల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాడదామని పిలుపునిచ్చారు. కార్మిక అమర వీరులకు ఘనంగా నివాళులర్పించేందుకు తరలి రావాలని కోరారు.

అక్రమ తవ్వకాలు ఆపాలి

మండపేట: కలెక్టర్ ఆదేశాలను పట్టించుకోకుండా కపిలేశ్వరపురం మండలం తాతపూడి– పెరుగులంక వద్ద మట్టి, ఇసుకను అక్రమంగా తరలించుకుపోతున్నారని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ఆరోపించారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ అనధికార తవ్వకాలతో లంక గ్రామాలకు ముప్పు వాటిల్లే ప్రమాదముందన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ నల్లమిల్లి వీర్రెడ్డి, పార్టీనేత ఉంగరాల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్‌లో శశి విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ కనబర్చిన విద్యార్థులతో రవికుమార్ తదితరులు

మండపేట: ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో శశి మండపేట క్యాంపస్‌కు చెందిన విద్యార్థులు ఉత్తమ మార్కులతో సత్తా చాటారని శశి విద్యాసంస్థల చైర్మన్ బూరుగుపల్లి రవికుమార్ తెలిపారు. ఎంపీసీ గ్రూపులో ఇ.హర్షిత 986 మార్కులు, కె.కవిత తేజస్విని, వి.రిషిత, ఎమ్.కావ్యశ్రీ, పి.మహాలక్ష్మి 985 మార్కులు సాధించారని, బైపీసీలో కె.సింధుప్రగతి 988 మార్కులు, ఈవీబీ తేజస్విని 984 మార్కులు, వి.స్రవంతిరెడ్డి 981 మార్కులు సాధించారన్నారు. జూనియర్ ఇంటర్ ఎంపీసీలో 470 మార్కులకు ఎంఎల్ కావ్యశ్రీ 466 మార్కులు, ఎస్ఎస్‌డీ లక్ష్మి, ఎం.నవ్యశ్రీ 465 మార్కులు, బైపీసీలో 440 మార్కులకు జీహెచ్ఎంఎస్ నిత్యశ్రీ 434 మార్కులు, ఎం. అబ్దుల్ జాఫర్ 433 మార్కులు, ఎం.జోత్స్న చౌదరి 432 మార్కులు సాధించారని తెలిపారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను, అధ్యాపక బృందాన్ని శశి విద్యాసంస్థల వైస్ చైర్‌పర్సన్ బూరుగుపల్లి లక్ష్మి సుప్రియ అభినందించారు.

సీనియర్ ఇంటర్‌లో 'ఆదిత్య' సత్తా



సత్తి కృష్ణతులసి



అప్పలాభక్తుల వినయచంద్రిక



తోట లక్ష్మీ ప్రియ సాత్విక

మండపేట: సీనియర్ ఇంటర్ ఫలితాల్లో మండపేట ఆదిత్య కళాశాల విద్యార్థులు సత్తా చాటి ఉత్తమ ఫలితాలు సాధించినట్టు కళాశాల డైరెక్టర్ చిర్ల సుబ్బిరెడ్డి తెలిపారు. ఎంపీసీ గ్రూప్‌లో 991 మార్కులతో సత్తి కృష్ణతులసి రాష్ట్ర స్థాయిలో మొదటి ర్యాంకు సాధించిందన్నారు. వీఎస్ఎన్ ప్రసన్న, చిర్ల సుస్మితారెడ్డి 986 మార్కులు సాధించగా బైపీసీలో అప్పలాభక్తుల వినయచంద్రిక 986 మార్కులు, పెద్దింశెట్టి సుమలత 985 మార్కులు, ఎంఈసీ గ్రూపులో తోట లక్ష్మీప్రియ సాత్విక 981 అత్యధిక మార్కులు సాధించారన్నారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ నల్లమిల్లి శేషారెడ్డి, సెక్రటరీ కృష్ణదీపక్‌రెడ్డి, డైరెక్టర్ సుబ్బిరెడ్డి, అధ్యాపక బృందం గురువారం ఒక ప్రకటనలో అభినందించారు.

పట్టణ సమగ్రాభివృద్ధికి ప్రణాళికలు

- చైర్‌పర్సన్ శ్రీదేవి
- 7 అంశాలకు కౌన్సిల్ ఆమోదం



సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ శ్రీదేవి

రామచంద్రపురం: రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార, పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ సూచనలు, సహకారంతో మున్సిపాలిటీ సమగ్రాభివృద్ధికి ప్రణాళికలు తయారు చేస్తున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ గాధంశెట్టి శ్రీదేవి తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలో కౌన్సిల్ సమావేశం శ్రీదేవి అధ్యక్షతన గురువారం జరిగింది. పురపాలక సంఘం పరిధిలోని వివిధ పనులకు సంబంధించిన 7 అంశాలను సభ్యుల ఆమోదం కోసం ప్రవేశపెట్టారు. వీటిని సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. అనంతరం శ్రీదేవి మాట్లాడుతూ, పెరుగుతున్న పట్టణ విస్తీర్ణానికి అనుగుణంగా ప్రణాళికలు సిద్ధం చేయాల్సిందిగా అధికారులను ఆదేశించామన్నారు. ప్రతి ఇంటికీ తాగునీటితో పాటు మున్సిపాలిటీకి ఆదాయం సమకూర్చే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. పట్టణంలోని ప్రధాన డ్రైన్లను అభివృద్ధి చేసేందుకు ఇప్పటికే ప్రతిపాదనలు తయారు చేశామని చెప్పారు. మున్సిపల్ విప్ వాడ్రేవు సాయిప్రసాద్ మాట్లాడుతూ, మున్సిపాలిటీ పరిధిలోని మొత్తం చెట్ల లెక్క తేల్చాలని అన్నారు. కొంత మంది కొబ్బరి చెట్లను అన్యాక్రాంతం చేసుకుని లబ్ధి పొందుతున్నారని, ఏయే చెట్లు ఎన్ని ఉన్నాయో లెక్క తేల్చి నంబర్లు వేసిన తరువాత వేలం నిర్వహించాలని కమిషనర్‌ను కోరారు. దీనిపై చర్యలు తీసుకుంటామని కమిషనర్ శ్రీకాంత్ రెడ్డి చెప్పారు.

అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేయాలి

మున్సిపల్ కార్యాలయం ఆవరణలో మహాత్మా గాంధీ విగ్రహం వద్ద రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం కూడా ఏర్పాటు చేయాలని వైస్ చైర్మన్ కోలమూరి శివాజీ, కౌన్సిలర్లు పైడిమళ్ల సత్తిబాబు, దొమ్మలపాటి మీనా ప్రియాంక, అమలుదాసు లోవరాజు కోరారు. ఈమేరకు సమావేశం అనంతరం చైర్‌పర్సన్ శ్రీదేవికి వినతిపత్రం అందజేశారు.

పట్టు పరిశ్రమతో ఆదాయం

కాకినాడ సిటీ: జిల్లాలో మెట్టప్రాంత రైతులు బోరు కింద వ్యవసాయం చేసే వారు పట్టు పరిశ్రమను చేపట్టి అధిక ఆదాయం పొందాలని కలెక్టర్ కృతికా శుక్లా అన్నారు. గురువారం కలెక్టర్ చాంబర్‌లో పట్టు పరిశ్రమశాఖకు సంబంధించి పోస్టర్లను జిల్లా పట్టు పరిశ్రమ అధికారి బీఎంపీ రామరాజుతో కలసి విడుదల చేసిన సందర్భంగా మాట్లాడారు. పట్టు పరిశ్రమ వల్ల రైతులకు, డీలర్లుకు, వీవర్స్‌కు, చేనేత కార్మికులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తుందన్నారు. మల్బరీ తోటలు కొత్తగా నాటే రైతులకు ఎకరానికి రూ.25 వేలు యూనిట్ విలువపై 75 శాతం సబ్సిడీ రూ. 18,750 అందిస్తున్నట్లు తెలిపారు.

ప్రజా సంక్షేమానికి అధిక ప్రాధాన్యం

- విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి
- చెముడులంకలో గడప గడపకూ మన ప్రభుత్వం

ఆలమూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సహకారంతో ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తూనే నియోజకవర్గాన్ని అభివృద్ధిలో అన్ని విధాలా అగ్రగామిగా తీర్చిదిద్దామని కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. చెముడులంకలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్, సర్పంచ్ తమ్మన శ్రీనివాస్ ఆధ్వర్యాన తొలివిడత గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల లబ్ధిని ఎమ్మెల్యే వివరించారు. ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, అధికార వ్యామోహంతో గ్రామాల్లో కులాల కుంపట్లు రాజేసేందుకు ప్రతిపక్షాలు ప్రయత్నిస్తున్నాయని అన్నారు. రాష్ట్ర చరిత్రలోనే మునుపెన్నడూ లేని విధంగా ప్రజా సంక్షేమం కోసం అహర్నిశలూ శ్రమిస్తున్న సీఎం జగన్‌ను రాబోయే ఎన్నికల్లో మరోసారి ఆశీర్వదించాలని అభ్యర్థించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, నవరత్నాల ద్వారా గ్రామంలోని లబ్ధిదారులకు రికార్డు స్థాయిలో రూ.6.68 కోట్ల మేర లబ్ధి చేకూర్చామని చెప్పారు. అనంతరం రూ.20 లక్షలతో నిర్మించనున్న ఎస్సీ కమ్యూనిటీ హాలు నిర్మాణానికి ఆయన భూమి పూజ చేసి, శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. కోట్లాది రూపాయలతో మేజర్ డ్రైనేజీ వ్యవస్థను నిర్మించడం ద్వారా గ్రామ రూపురేఖలు మార్చివేసిన విప్ జగ్గిరెడ్డికి సర్పంచ్ తమ్మన నేతృత్వంలో పాలకవర్గ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సేవాదళ్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి చల్లా ప్రభాకరరావు, ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, జెడ్పీటీసీ సభ్యులు తోరాటి సీతామహాలక్ష్మి, ఎంఏఎస్ అధ్యక్షుడు యనమదల నాగేశ్వరరావు పాల్గొన్నారు.



ఎస్సీ కమ్యూనిటీ హాలు నిర్మాణ శిలాఫలకం ఆవిష్కరిస్తున్న విప్ జగ్గిరెడ్డి